ప్రజాశక్తి
ఆదివారం 04 మే 2025
5
కర్నూలు



కార్పొరేషన్ ఆదాయం దళారుల పాలు

- ఐటిసి స్ట్రీట్ మార్కెట్ దుకాణాల నుంచి డబ్బు వసూలు చేస్తున్న మాజీ టెండర్ దారులు
- ఈ ఏడాది జనవరి తోనే ముగిసిన టెండర్లు
- నూతన ప్రక్రియ ప్రారంభించని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ ఐటిసి సర్కిల్ వద్ద లక్షల రూపాయలు ఖర్చు చేసి స్ట్రీట్ మార్కెట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక ఏడాది కాలానికి సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగించి 35 దుకాణాలను టెండర్‌దారులకు అందించారు. ఈ టెండర్ ప్రక్రియలో మున్సిపల్ కార్పొరేషన్‌కు సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జనవరి నెలలో టెండర్ సమయం ముగిసింది. ఫిబ్రవరి నెల నుంచి కొత్త టెండర్లు వేయాల్సిన మున్సిపల్ అధికారులు ముద్దు నిద్ర పోతున్నారు. దీంతో పాత టెండర్దారులే ఫిబ్రవరి నెల నుంచి దుకాణాల నుంచి అద్దెలు వసూలు చేసుకుని తింటున్నారు. దుకాణాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా వారు స్పందించడం లేదని స్థానికులు నాయకులు వాపోతున్నారు. దుకాణదారులు కూడా పాత టెండరుదారులకే నెల నెలా అద్దెలు చెల్లిస్తూ భయాందోళన మధ్య వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు వచ్చి మళ్లీ అద్దెలు చెల్లించాలని అడిగితే ఎలా కట్టేది అని కొంతమంది దుకాణ దారులు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. స్ట్రీట్ మార్కెట్లో సుమారు 35 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణం నుంచి రూ 3వేల నుంచి రూ.5000 వరకు పాత టెండరుదారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. స్ట్రీట్ మార్కెట్లోని దుకాణాలకు టెండర్ ప్రక్రియ కొనసాగించకపోవడంతో టెండర్‌దారులు వసూల్ రాజాలు అయ్యారు. అందిన కాడికి డబ్బు వసూలు చేసుకుని దుకాణదారుల వద్ద హల్‌చల్ చేస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారిలో ఎలాంటి మార్పు రాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కొత్త టెండర్లు పిలిచి ప్రభుత్వానికి ఆదాయాన్ని రాబట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అధికారులు వెంటనే టెండర్లు పిలవాలి



- ఏసు, సిపిఎం నాయకులు, శరీన్ నగర్

ఐటిసి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన స్ట్రీట్ మార్కెట్‌లో దుకాణాలకు వేసిన టెండర్ ప్రక్రియ సమయం పూర్తి అయింది. మున్సిపల్ అధికారులు దుకాణాలకు టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. దుకాణదారులు ఎవరికి అద్దెలు చెల్లించాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. లేదంటే నామినల్ రేట్ తో దుకాణదారులకు దుకాణాలను కేటాయించాలి.

వ్యాపారాలు జరగడం లేదు...

- సంతోష్ రెడ్డి స్థానికులు



ఐటిసి సర్కిల్‌లో స్ట్రీట్ మార్కెట్లో ఏర్పాటు చేసిన దుకాణాలలో వ్యాపారాలు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఇక్కడ కొన్ని దుకాణాలలో ఇప్పటివరకు వ్యాపారాలను ప్రారంభించలేదు. కొంతమంది దుకాణదారులు వ్యాపారాలు ప్రారంభించినా అనుకున్న స్థాయిలో వ్యాపారం జరగకపోవడంతో నష్టాలు వచ్చి దుకాణం మూసుకుని వెళ్లారు. ఇలాంటి పరిస్థితులలో టెండర్ల ప్రక్రియ భారంగా ఉంటుంది. మున్సిపల్ అధికారులు ఆలోచించి ఒక్కో దుకాణానికి నామినల్ రేటు నిర్ణయిస్తే బాగుంటుంది.

'బెల్టు'తో మద్యం ఏరులు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, కూటమి ప్రభుత్వం ప్రయివేటుకు అప్పగించింది. మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించారు. పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతో పాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణ పరిధిలో పెద్దఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. గ్రామాల్లో ప్రాంతాలవారీగా బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. బెల్టుషాపులకు సైతం పెద్దఎత్తున పోటీ సాగుతోంది. స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. బెల్టుషాపు ఎవరికివ్వాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టుషాపు కేటాయించిన వారి నుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఒక అధికారిక మద్యం దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా 20కుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యక్తులు క్వార్టర్ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 అదనంగా ధర వసూలు చేసేందుకు నిర్ణయించారు. వీరికి ముందుగా 40 నుంచి 50 వరకూ మద్యం బాటిల్స్ ఇస్తున్నారు. అమ్మకాలను బట్టి బాటిల్స్ అందించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. బెల్టు షాపుల ఏర్పాటుతో మద్యం ప్రతి వీధికీ, ప్రతి పేటకు చేరుతున్న పరిస్థితి ఉంది. జనాలను తాగుబోతులుగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తోంది. బెల్టు దుకాణాల ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తికి తక్కువగా లెక్కించినా రూ.కోటి వరకూ ఖర్చవుతుందని, సొమ్ము రాబట్టుకోవాలంటే బెల్టు షాపులు తప్పనిసరని ప్రజాప్రతినిధులు మాట్లాడు తుండటం గమనార్హం. గత ప్రభుత్వం తరహాలో కూటమి ప్రభుత్వం బెల్టుషాపులను ప్రోత్సహిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సహకార ఛైర్మన్ల నియామకం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్)లకు ఛైర్మన్లను ప్రభుత్వం నియమించింది. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా డి.విష్ణువర్ధన్ రెడ్డిని, కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్‌గా జి.నాగేశ్వరరావు యాదవ్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

కార్మికోత్సాహం: జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. బళ్లారి చౌరస్తా నుంచి కర్నూలు మార్కెట్ యార్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యజమానులకు అనుకూలంగా, కార్మికులకు నష్టదాయకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యాలయంలోనూ ఎర్ర జెండాను గఫూర్ ఆవిష్కరించారు. అంతకుముందు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి నివాళులర్పించారు. ఆలూరు, దేవనకొండ, కోసిగి, కౌతాళంలో ర్యాలీ చేపట్టారు. నంద్యాల సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు.

ఊసులేని కొత్త కౌలు చట్టం : ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. శీతాకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశాలు కూడా ముగిసిపోయాయి. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాల అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.



20న హర్తాల్‌ను విజయవంతం చేయండి

- ఎపి రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

20న దేశవ్యాప్త హర్తాల్‌ను విజయవంతం చేయండని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 20,000 పెట్టుబడి సహాయం హామీని అమలు చేయాలని, కొత్త కౌలు చట్టం, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ మే 20న గ్రామ, మండలాల్లో ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించాలని ఆయన కోరారు. కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో శనివారం ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో అన్ని పంటలకు మద్దతు ధరలు అమలు చేస్తామని, 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు గడిచినా రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని, పైగా రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు పెరిగాయని అన్నారు. పదేళ్లలో 4 లక్షల మందికి పైగా రైతులు, కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల గుప్పిట్లోకి మార్చేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం 2020లో తెచ్చిన 3 నల్ల వ్యవసాయ చట్టాలను భారత రైతాంగం 13 నెలలకు పైగా పోరాడి రద్దు చేయించిందని గుర్తు చేశారు. కానీ, మోదీ ప్రభుత్వం అవే చట్టాలను డిజిటల్ అగ్రిమిషన్, నేషనల్ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్, బహుళ సహకార సంస్థల చట్టం పేర్లతో అమలు చేస్తూ చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులను కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందకు తెస్తోందని విమర్శించారు. ఇది దొడ్డిదారిన 3 నల్ల వ్యవసాయ చట్టాలను అమలు చేయడమేనని, ఇది జరిగితే రైతుకు ఏ మాత్రం రక్షణ ఉండదని, వ్యవసాయం మొత్తం అదానీ, అంబానీ, ఐటిసి, వాల్‌మార్ట్ వంటి వ్యవసాయ కార్పొరేట్ కంపెనీల పరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా రైతులను భూమికి దూరం చేస్తున్నారని తెలిపారు. వేసవిలో వలసల నుంచి కాపాడుతూ గ్రామీణ పేదలకు ధైర్యం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తూ, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా మే 20న కార్మికులు చేస్తున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామ, మండల కేంద్రాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు, రాస్తారోకోలు వంటి వివిధ రూపాల్లో నిరసనలకు పిలుపునిచ్చాయని, వాటిలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ.. గత 11 ఏళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా, అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సి. హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షులు కోటకొండ సూరి, జిల్లా నాయకులు గొందిపర్ల మాజీ సర్పంచ్ జి. ఆంజనేయులు, హోలగుంద వెంకటేశ్వర్లు, పాలకుర్తి గిడ్డయ్య, పత్తికొండ సిద్ధయ్య, గౌడ్, కృష్ణగిరి మార్కండేయులు, ఆదోని అయ్యప్ప, ఆలూరు ఈరన్న, హోలగుంద రవికుమార్, ఉల్చాల మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కనీస వేతన సవరణ అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థలు, కార్యాలయాలలోనూ, సెమీ గవర్నమెంట్ విభాగాలు, శాఖల్లో పనిచేస్తున్న క్యాజువల్, కంటింజెంట్, మస్టర్‌రోల్ ఉద్యోగులకు చట్ట ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రోజువారీ కనీస వేతన సవరణ చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కార్మికశాఖ ఆధ్వర్యంలో రోజువారీ కనీస వేతన సవరణకు సంబంధించి వివిధ ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమలులో ఉన్న ఉత్తర్వుల మేరకు గతంలో ఉన్న వేతనాలను 5 శాతం పెంపు చేస్తూ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి క్యాజువల్, కంటింజెంట్, మస్టర్ రోల్ ఉద్యోగులకు రోజువారీ వేతనాలను పెంచాలన్నారు. నైపుణ్యం లేని వారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.497 లు, పట్టణ ప్రాంతాల్లో రూ.573 లు, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ. 645 లు గా వేతనాలను నిర్ధారించామన్నారు. పాక్షిక నైపుణ్యాలు గల వారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.563 లు, పట్టణ ప్రాంతాల్లో రూ.651లు, మున్సిపల్ కార్పొరేషన్ లోరూ. 728 లు గా వేతనాలను నిర్ధారించామన్నారు. నైపుణ్యం గల వారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 662 లు, పట్టణ ప్రాంతాల్లో రూ. 761 లు, మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.860 లు గా వేతనాలను నిర్ధారించామని కలెక్టర్ వివరించారు. ఆయా ఇంజనీరింగ్ శాఖలు, ఇతర సంస్థల్లో పనిచేసే వారి రోజువారీ వేతనాలకు సంబంధించి ఈ ఉత్తర్వులను పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ వృత్తుల్లో ఉన్న వారితో ఆన్‌లైపోర్టల్ ను రూపొందించాలన్నారు. జిల్లాలో ఉన్న ఎలక్ట్రీషియన్ లు, ప్లంబర్లు, కార్పెంటర్లు తదితర వృత్తుల్లో పనిచేసే వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖ అధికారులను ఆదేశించారు .ప్రజలకు సేవలు అందించడంతో పాటు ఆయా వత్తుల్లో పని చేసే వారికి ఉపాధి కల్పించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆయావృత్తుల్లో ఉన్న వారితో సమావేశాలు ఏర్పాటు చేసి, వారితో మాట్లాడి, పోర్టల్‌లో వారిని రిజిష్టర్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖ అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో వీరి వివరాలు ఉంటే, ప్రజలకు అవసరమైనపుడు వారికి ఫోన్ చేసి వారి సేవలను ఉపయోగించుకుంటారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ సీతాలక్ష్మి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ రాజశేఖర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఇఇ, ఆర్ అండ్ బి ఇఇ,పంచాయతీ రాజ్ శాఖ డిఇ, డిఆర్‌డిఎ పిడి తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి కృష్ణమూర్తి హఠాన్మరణం-నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు శ్రీరామ నగర్ లో శుక్రవారం రాత్రి బాధాకర సంఘటన చోటుచేసుకుంది. బ్యాంకు రిటైర్డు ఉద్యోగి గోవర్ధనగిరికి చెందిన కె.కృష్ణమూర్తి (69) అకస్మాత్తుగా మృతి చెందారు.వారికి ఇద్దరు సంతానం. కూతురు డాక్టర్ స్వాతి ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్ సతీమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి ప్రభుత్వ జనరల్‌హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. కుమారుడు కె.శశాంక్ బ్యాంక్ ఆఫ్ అమెరికా చికాగోలో పనిచేస్తున్నారు. 2015లో ఆంధ్రా ప్రగతి బ్యాంకు ఉద్యోగం నుంచి కె. కృష్ణమూర్తి రిటైర్ అయ్యారు. ఆయన బ్యాంకులో విధులు నిర్వహిస్తూ, సహోద్యోగుల మధ్య మంచి పేరు సంపాదించుకున్నారు. బెస్ట్ బ్యాంకర్ అవార్డ్ తోపాటు ఆయన సేవలకు మరెన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. కృష్ణమూర్తి మృతితో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సహోద్యోగులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయన సేవలను గుర్తిస్తూ బ్యాంకు అధికారులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు కర్నూలులో ఆదివారం జరగనున్నాయి.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామంలో భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసార పరీక్షలు చేయించడానికి మే మాసం సరైన సమయమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. భూసార పరీక్షా ఫలితాల అనుగుణంగా ఎరువులు వాడి పంటకు అవసరమైన పోషకాలను అందించాలని తెలిపారు. రైతులు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డుల జారి కౌలు పై సాగు చేస్తున్న రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి కౌలు కార్డులను పొందాలని తెలిపారు. కౌలుదారు కార్డులు ఇవ్వడం వల్ల కౌలు రైతులకు భూమిపై ఎటువంటి ఆధిపత్యం ఉండదని కావున భూ యజమానులు ఆందోళన చెందవల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. కౌలుదార్ కార్డు 11 నెలల కాలపరిమితితో ఉంటుందన్నారు. రాయితీపై పురుగు మందుల పిచికారి యంత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఆహార , పోషకాహార భద్రత పథకం ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై వేపనూనె, పురుగుమందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి, పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్ ,వెల్దుర్తి మండల వ్యవసాయాధికారి ఆర్ అక్బర్ బాషా, కలుగొట్ల సర్పంచి మద్దిలేటి, ఎఇఒ అజయ్ భార్గవ్, ఆర్‌ఎస్‌కె ఇంచార్జ్ శ్రావణ్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కార్డియాలజీ విభాగంలో నూతన బెడ్ల ఏర్పాటు

ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

దాత డాక్టర్ విజయ కృష్ణారెడ్డిని అభినందించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు సర్వ జన ఆస్పత్రి కార్డియాలజీ విభాగంలో 30 నూతన బెడ్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ప్రారంభించారు. గతంలో కార్డియాలజీ హెడ్‌ఆఫ్ ది డిపార్ట్మెంట్ గా పనిచేసిన కీర్తిశేషులు డాక్టర్ రామకృష్ణారెడ్డి కుమారుడు డా విజయ కృష్ణారెడ్డి రూ.పదిలక్షలతో కార్డియాలజీ విభాగానికి ఆధునిక సౌకర్యం గల 30 బెడ్స్‌ను బహూకరించారు. కలెక్టర్ వాటిని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ రామకృష్ణారెడ్డి వంటి వైద్యులు ప్రభుత్వంలో పనిచేస్తూ ప్రజల కోసం సేవలందించడం గొప్ప విషయమన్నారు. ఆయన జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు చేసిన ఈ విరాళం అభినందనీయమని తెలిపారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ రామకృష్ణారెడ్డి 1972 నుంచి 2000 వరకు కార్డియాలజీ విభాగంలో అద్భుత సేవలందించారన్నారు. ఆయన కుమారుని కృషిని అభినందించారు. డాక్టర్ విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "మా తండ్రి సేవలను గుర్తుండేలా చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ చంద్రశేఖర్ సూచన మేరకు ఈ విరాళం ఇచ్చానన్నారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పేస్ మేకర్ వేయించుకున్న రోగులు, సర్జరీలు చేయించుకున్న వారు, గుండె సంబంధిత చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పరామర్శించారు. వారికి జరిగిన ఆపరేషన్, అందుతున్న చికిత్స వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ రోగులకు అందిస్తున్న చికిత్స, అందుతున్న వైద్యసేవల వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. తదుపరి కార్డియాలజీ విభాగం క్యాత్ లాబ్ లో జరుగుతున్న యాంజియోగ్రామ్ సర్జరీని జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ సర్జరీ చేస్తున్న విధానాన్ని మానిటర్లో చూపించి కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ సీతారాములు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, సంబంధిత డాక్టర్లు పాల్గొన్నారు.


నూతన బెడ్లను రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

నిస్వార్థ సేవకు గుర్తింపు

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ చంద్రశేఖర్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలుహాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ నిస్వార్ధ సేవలకు గుర్తింపు లభించిందని, ఆయన అందించిన వైద్య సేవలే ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమింపబడటానికి కారణమయ్యాయని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. చేసే సేవలే గుర్తింపు తెస్తాయని, రాయలసీమ నుంచి మొదటి వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ కావడం గర్వకారణమన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కర్నూలు మెడికల్ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య విద్యలో రీసెర్చ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తానని, రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది డాక్టర్ చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. నర్సింగ్ అసోసియేషన్, టిఎన్‌టియుసి నాయకులు కూడా ఆయనను సత్కరించారు.



డాక్టర్ చంద్రశేఖర్ ను జ్ఞాపికతో సత్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష, చిట్టినరసమ్మ

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం

జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శ్రీశైలం దర్శనానంతరం తిరిగి వస్తూ నంద్యాల జిల్లా బైర్లూటి సమీపంలో ప్రమాదానికి గురై గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ఆదోని పట్టణ వాసులు శ్రీశైలం దర్శనానంతరం తిరిగి వస్తూ నంద్యాల జిల్లా బైర్లూటి సమీపంలో ప్రమాదానికి గురై గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వారిని శనివారం కలెక్టర్ పరామర్శించారు..పురుషుల , స్త్రీల వార్డులలో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్ళి జిల్లా కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాధితులకు ధైర్యం చెప్పారు. గాయపడ్డ వారందరికీ మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు గాయపడ్డ వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రి పర్యటనలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగస్వామి , జిల్లా అధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు.



నీట్ పరీక్ష నిర్వహణకు పటిష్ట భద్రత

-జిల్లా కేంద్రంలోని 16 పరీక్ష కేంద్రాల వద్ద 210 పోలీసులు

-జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ఈనెల 4న నీట్ యూజీ- 2025 పరీక్ష జరుగుతున్న సంధర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ శనివారం పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో 16 పరీక్షా కేంద్రాల వద్ద నీట్ పరీక్షకు 210 మంది పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. పరీక్షకు మొత్తం 4,466 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ప్రతి కేంద్రానికి ఒక సిఐ లేదా ఎస్ఐ స్థాయి పోలీసు అధికారిని నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ విధించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. నీట్ పరీక్షకు వెళ్ళే అభ్యర్థులకు ట్రాఫిక్ వల్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని , పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పి తెలిపారు.



ఉషు రాష్ట్రస్థాయి పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న టి జి వెంకటేష్

13న రాష్ట్రస్థాయి ఉషు పోటీలు

లోగోను ఆవిష్కరించిన టి జి వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14వ తేదీలలో రాష్ట్ర స్థాయి ఉషు పోటీలు నిర్వహిస్తారని ఉషు కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కర్నూలు బి. క్యాంప్ లోని టిజి లక్ష్మి వెంకటేష్ కళ్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, ఉషు పోటీలకు సంబంధించిన లోగోను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ శనివారం లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోటీలను నిరూపించే వాటిల్లో కర్నూలు జిల్లా ముందుంటుందని, అందులో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు తమ వంతు సహకారాలు ఉంటాయని తెలిపారు. జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పోటీలు టిజివి, టిజిబి స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం అసోసియేషన్ కార్యదర్శి జి శ్రీనివాసులు, జిల్లా తైక్వాండో సంఘం ప్రతినిధులు సతీష్ కుమార్, వీరేష్ బాబు, మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



తెర్నేకల్లులో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బ్యాంకు తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును మరో చోటుకు తరలించరాదని గ్రామస్తులు శనివారం బ్యాంకు ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామ పెద్దలు సత్యరాజు, చిన్న వెంకప్ప, సిపిఎం నాయకులు బజారి మాట్లాడుతూ... చాలా ఏళ్ల నుంచి బస్ స్టేషన్ సమీపంలో అందరికీ ఆమోదయోగ్యమైన, అన్ని రకాల సౌకర్యాలు కలిగిన భవనంలో రైతులకు, బ్యాంకు ఖాతాదారులకు సేవలందిస్తున్న బ్యాంకును గ్రామ చివరన హంద్రీ వాగు సమీపంలోకి తరలించడం తగదని తెలిపారు. బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు విమర్శించారు. బ్యాంకును కొత్త చోటుకు మార్చకుండా పాత భవనంలోనే కొనసాగించేలా సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేస్తూ గ్రామస్తులు బైఠాయించారు. బ్యాంకు తరలింపుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించబోమని హెచ్చరించారు. బ్యాంకు మేనేజర్ శశి కుమార్ రెడ్డి ధర్నా చేపట్టిన గ్రామస్తులతో మాట్లాడుతూ... సంబంధిత బ్యాంకు శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలపడంతో ఆందోళనను విరమించారు. ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ బెల్ ఈరన్న, సిపిఎం నాయకులు పరమేష్, గ్రామ పెద్దలు పులికొండ, శ్రావణి, మాదన్న, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- కార్మిక సంఘాల నాయకులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 20న జరిగే దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శనివారం కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదోని మున్సిపల్ కార్యాలయం దగ్గర అన్ని కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. బి.వెంకన్న, పిఎస్.గోపాల్ అధ్యక్షతన సమ్మె గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బి.వెంకప్ప మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, కొత్తగా ప్రవేశపెడుతున్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 20న సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని కోరారు. ఎఐటియుసి అధ్యక్షులు భీమేష్, ఒబి.నాగరాజు, హుస్సేని, సిఐటియు నాయకులు తిప్పన్న, ఐఎఫ్‌టియు నాయకులు కుమార్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పాండవగల్ గ్రామంలో వ్యవసాయ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు మాట్లాడారు. వ్యకాస నాయకులు పాండురంగ, గోవిందు, రైతు సంఘం మండల నాయకులు హనుమంత రెడ్డి, సిఐటియు నాయకులు హనీఫ్ బాష పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ భరద్వాజ్

శ్రీశైలం యాత్రలో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందిన వారి కుటుంబాలకు, గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని మృతుల కుటుంబాల వద్దకు వెళ్లి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని తెలిపారు. బొలేరో వాహనంలో ఈ విధంగా కింద, పైన ఓవర్ లోడ్‌లో ఎవరూ ప్రయాణించ వద్దని ప్రజలకు సూచించారు. మృతి చెందిన కుటుంబాలకు, ప్రమాదంలో గాయపడిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. తహశీల్దార్ శివ రాములు, నాయకులు ఉన్నారు.

ఇప్పటి నుంచి మరో లెక్క..!

- ఆదోనిని ప్రగతి పథంలో నడిపిద్దాం
- మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ మహ్మద్ గౌస్

ప్రజాశక్తి - ఆదోని

రాజకీయాలకతీతంగా సమిష్టిగా ఆదోనిని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పనులు చేపట్టడంలో ఇప్పటి దాకా ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క అని మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్, వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. శనివారం ఛైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ ఇంజినీర్లు ఇంతియాజ్, రామ్మూర్తి, గోపీనాథ్, చలపతి రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి వార్డు ఇన్‌ఛార్జీలు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏకపక్ష నిర్ణయాల వల్ల పనులు జరగలేదన్నారు. ఇప్పటి నుంచి పనులు జరగడంలో తాత్సారం లేకుండా చూస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల విస్తరణ, శుభ్రత, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలపై సమాలోచనలు జరపాలన్నారు. అధికారులు, కౌన్సిలర్లు అభిప్రాయాలను పంచుకుంటూ, సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 56 పనులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు చేపట్టేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ షఫీ మాట్లాడుతూ... అత్యవసర విభాగమైన పారిశుధ్య పనుల్లో భాగంగా వంకల్లో పూడిక పనులు చేశామని, ఇంతవరకు బిల్లు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. మరో కాంట్రాక్టర్ జైపాల్ మాట్లాడుతూ... వ్యయప్రయాసాలకోర్చి పనులు చేసినా సకాలంలో బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రికార్డు చేసిన బుక్కులను కొందరు తస్కరిస్తూ బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని ఇంజినీరింగ్ సెక్షన్‌పై ఫిర్యాదు చేశారు. గౌలి పేట, పంజారా పోలు ప్రాంతాల్లో మురుగుదొడ్లు నిర్మించి నెలలు గడిచినా ఇంతవరకు పూర్తి స్థాయిలో బిల్లు ఇవ్వలేదని వాపోయారు. నీటి సరఫరా విభాగంలో మోటార్ల మరమ్మతులకు నిధులు సకాలంలో ఇవ్వాలని మరో కాంట్రాక్టర్ కోరారు. వైస్ ఛైర్మన్ నరసింహులు మాట్లాడుతూ... మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను త్వరలోనే మొదలు పెట్టిస్తామని తెలిపారు. అవసరమైతే ఎమ్మెల్యే పార్థసారథిని సంప్రదించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు మొదలయ్యేలా చూస్తామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ గోపీనాథ్ మాట్లాడుతూ... పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వారంలోపు అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసిన తర్వాతే పూర్తిస్థాయిలో బిల్లు చెల్లిస్తామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, సందీప్ రెడ్డి, బాలాజీ, ఉస్మాన్, ఇంతియాజ్, చలపతి, వసీం, అశోక్, నాయకులు మమ్ముట్టి స్వామి, మధు, కిశోర్, ఇబ్రహీం, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జీ ఛైర్మన్ మహ్మద్ గౌస్

రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యం

- ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - కౌతాళం

అకాల వర్షాలకు వరి పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను అధికారులు పట్టించుకోలేదని నదీచాగి సర్పంచి మహేష్, ఎంపిటిసి లింగన్న గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌతాళంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సభా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించి కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్ మాట్లాడుతూ... మండల గ్రాంట్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు, సమస్య పరిష్కారం కోసం మరో పైపు లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అకాల వర్షాల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయకుండా, రైతుల గురించి పట్టించుకోకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులను పట్టించుకోలేదని అధికారులను నిలదీశారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంతో శాఖ సంబంధిత నివేదికలు సభా దృష్టికి రాకపోవడంతో సర్పంచులు, ఎంపిటిసిలు నిరుత్సాహానికి గురయ్యారు. వైస్ ఎంపిపి బుజ్జి స్వామి పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న ఎంపిటిసి లింగన్న గౌడ్

శ్రామిక మహిళా చట్టాల అమలుకు ఉద్యమించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రామిక మహిళల చట్టాల అమలుకు ఉద్యమించాలి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు కోరారు. శనివారం ఐసిడిఎస్ ప్రాంగణంలో అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. యూనియన్ రూరల్ కార్యదర్శి కె.శైలజ అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. గోవిందు, రాముడు, యూనియన్ అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ... శ్రామిక మహిళల చట్టాలు అమలు కావడం లేదని, పనికి తగిన వేతనం, కనీస వేతనం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీ నాయకులు నీరజ, శమీం, అరుణ, నాగలక్ష్మి, మల్లేశ్వరి, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, సంధ్య, సుధారాణి, హుస్సేనమ్మ, సుజాత, రంగమ్మ, శ్రీదేవి, తిప్పమ్మ, సిఐటియు నాయకులు బి.కాలప్ప, పి.రాజు, ఎం.గిరి బాష, రంగస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధనమ్మ

'గిరక బండి' పోటీల్లో విజేత గుడికల్లు

ప్రజాశక్తి - దేవనకొండ

గిరకబండి లాగుడు పోటీల్లో ఎమ్మిగనూరు మండలం గుడికల్లు గ్రామానికి చెందిన రంగయ్య వృషభాలు 2,800 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. మండలంలోని తువ్వదొడ్డి గ్రామంలో కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామ పెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి దాతలు రామకొండ లక్ష్మిరెడ్డి, చక్రాల రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.20 వేలు అందజేశారు. పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప వృషభాలు 2,478 అడుగులు లాగి రెండో స్థానంలో నిలవగా దాతలు వడ్డే సుంకన్న, గంగన్నలు రూ.15 వేలు అందజేశారు. ఎమ్మిగనూరు మండలం గుడికల్లు గ్రామానికి చెందిన ఆకుల మంగయ్య వృషభాలు 2,410 అడుగులు లాగి మూడోస్థానంలో నిలవగా దాతలు హకీమ్ బాష, లాల్ రూ.10 వేలు అందజేశారు. తుగ్గలి గ్రామం, ఎమ్మిగనూరు మండలాలకు చెందిన గుడికల్లు రైతులు ఉపేంద్ర, చాకలి నల్లయ్య వృషభాలు 2,400 అడుగులు సమానంగా లాగడంతో 4, 5వ స్థానాల్లో నిలిచాయి. దాతలు నాగభూషణ్ రెడ్డి, చిట్యాల మాదన్న ఒక్కొక్కరికి రూ.3,750 ప్రకారం అందజేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు

నేడు శ్రీగిర్లి లింగేశ్వరస్వామి పట్టా దేవర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఆదివారం శ్రీగిర్లి లింగేశ్వరస్వామి పంచమ పట్టా దేవర (పట్టాభిషేక) ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, భక్తులు శనివారం తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీగిర్లి లింగేశ్వరస్వామి, శ్రీఆయ్యమ్మ అవ్వ దేవితో కలిసి మొత్తం 11 దేవతల ఉత్సవ విగ్రహాలతో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలకు మామిడి తోరణాలు, పుష్ప అలంకరణ, ప్రతిష్టాపన పూజలు, విద్యుత్ అలంకరణ చేపట్టారు. ఆదివారం ఎంతో వైభవంగా శ్రీచంద్రం పట్టా దేవర మహోత్సవం జరుగుతుందని, పెద్దఎత్తున సామూహిక వివాహాలు కూడా జరుగుతున్నట్లు తెలిపారు. బీసీ వెల్ఫేర్ సవితమ్మ, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆదోని మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్పతోపాటు వివిధ గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు వస్తున్నట్లు చెప్పారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ హేమలత ఆదేశాల మేరకు, ఆదోని తాలూకా సిఐ నల్లప్ప పర్యవేక్షణలో ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామంలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్రెండ్‌షిప్ కప్ విజేత హోటల్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఆదోని

యూనిటీ ఆఫ్ ఆదోని ఫ్రెండ్‌షిప్ కప్-2025 విజేతగా ఆదోని హోటల్ అసోసియేషన్ జట్టు నిలిచింది. శనివారం ఆదోని మున్సిపల్ మైదానంలో ఫ్రెండ్‌షిప్ ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగిందని నిర్వాహకులు ముజీబ్ అహ్మద్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన సెల్‌ఫోన్ అసోసియేషన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హోటల్ అసోసియేషన్ జట్టు సభ్యులు 7 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఫ్రెండ్‌షిప్ కప్‌లో గెలుపొందిన జట్లకు, టోర్నమెంట్‌కు సహకరించిన దాతలు వినోద్ జైన్, వీరేష్, వినోద్ రెడ్డి, శ్రీనివాసులు గెలుపొందిన జట్లకు కప్‌లతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ... మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న ప్రతి టోర్నమెంట్‌కూ సహకరిస్తున్న అధికారులకు, పోలీసులకు, క్రీడాభిమానులకు, మీడియా మిత్రులకు, క్రీడా దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రిపోర్టర్ హుస్సేన్ బాష, రవి, సూరి, ఇక్బాల్, గౌస్, మ్యాచ్ నిర్ణేతలుగా వ్యవహరించిన ముస్తఫా, బాషను ఘనంగా సన్మానించారు.



కప్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

శ్మశాన వాటిక వివాదంలో తహశీల్దార్ ద్వంద్వ వైఖరి

- తహశీల్దార్ నిర్వాకంతో గ్రామంలో అలజడి - ఎలాంటి ఘర్షణలు జరిగినా తహశీల్దార్‌దే బాధ్యత - టిడిపి నాయకులు చేపల నాగేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో తహశీల్దార్ ఎస్.రవి ద్వంద్వ వైఖరి అవలంభించి ఒకే సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నారని టిడిపి నాయకులు చేపల నాగేష్ విమర్శించారు. శనివారం తహశీల్దార్ చెట్నిహల్లి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడారు. శ్మశాన వాటికలో ఉన్న స్థలంలో 1/4 భాగం చూపించి అక్కడ గోడ కట్టుకోవాలని తెలిపారు. 95 శాతం ఉన్న గ్రామస్తులకు నాలుగో వంతు, 5 శాతం ఉన్న ప్రజలకు మూడు భాగాల భూమిని కేటాయించడం వెనుక తోటి సామాజిక వర్గం వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఒక వైపు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినా తహశీల్దార్ మాత్రం కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రెండు వర్గాల వారిని కూర్చోబెట్టి సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను తాత్సారం చేస్తూ గ్రామంలోని ఇతర వర్గాలకు అన్యాయం చేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. తహశీల్దార్ నిర్ణయం వల్ల గ్రామంలో అలజడి నెలకొందని, ఎలాంటి గొడవలు జరిగినా ఆయనే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన స్థలం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

గోనెగండ్లలో చోరీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని మొట్టి వీధి దర్గా సమీపంలో నివాసం ఉంటున్న పిషారి ఉస్మాన్ ఇంట్లో శనివారం పట్టపగలే దొంగతనం జరిగింది. బాధితుని మేరకు వివరాలు... ఉస్మాన్ కుటుంబ సభ్యులు హైదరాబాదులో బంధువుల గృహ ప్రవేశానికి శనివారం మధ్యాహ్నం బయల్దేరి వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి అని వారి కుమారుడు ఇంటికి వెళ్లగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. దుండగులు మూడు తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.లక్ష నగదును దొంగిలించినట్లు బాధితుడు వాపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు దొంగతనం జరిగిన ఇంటిని పోలీసులు పరిశీలించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరారు.

దేవర ఉత్సవాలకు చర్యలు

- సిఐ మధుసూదన్ రావు

ప్రజాశక్తి - నందవరం

ఈనెల 6, 7న జరిగే దేవర ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ మధుసూదన్ రావు తెలిపారు. శనివారం ఆయన నాగలదిన్నె గ్రామానికి చెందిన గ్రామ పెద్దలను, ఇరుపార్టీల నాయకులతో ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో నందవరం పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. దేవరలో ఎటువంటి ఘర్షణలూ జరగకుండా చూడాలని వారికి సూచించారు. ఏదైనా సంఘటన జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోభీఘాట్లు నిర్మించాలి

ప్రజాశక్తి - ఆదోని

రజక వృత్తిదారులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో దోభీఘాట్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ ఛైర్మన్ సి.సావిత్రి కోరారు. శనివారం ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోనిలోని రెండో దోభీఘాట్ బాలే కొలనులో గత 90 ఏళ్లుగా రజకులు బట్టలు ఉతుకుతున్నారని తెలిపారు. వారికి కనీస సౌకర్యాలు హౌస్‌లు బోరు, షెల్టర్ షెడ్డు నిర్మించాలన్నారు. శాంత మల్లప్ప దోభీఘాట్‌లో షెల్టర్ షెడ్డును నిర్మించి ఆదోని రజక వృత్తిదారుల జీవన విధానాన్ని మెరుగుపరచాలని కోరారు. గోవిందప్ప, రవి ఉన్నారు.

ఆటో, స్కూటర్ ఢీకొని ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఆస్పరి



ఘటన స్థలంలో కోసిగమ్మ (51)

ఆటో, స్కూటర్ ఢీకొన్న ఘటనలో కోసిగమ్మ (51) మృతి చెందారు. యువకుడు జాకీర్ పరిస్థితి విషమంగా ఉంది. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... కోసిగి గ్రామానికి చెందిన కోసిగమ్మ బంధువులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో శనివారం పత్తికొండకు వెళ్లి తిరిగి ఆటోలో బయల్దేరారు. ఆటోలో ఆమెతో పాటు మరో ఆరుగురు ఉన్నారు. ఆస్పరి సమీపంలోని పత్తికొండ రోడ్డులో పత్తికొండ నుంచి వస్తున్న ఆటో ఆస్పరి నుంచి పత్తికొండ వైపు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టడంతో కోసిగమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే సిఐ మస్తాన్ వలీకి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పరిలో ఉన్న రాజస్థాన్ ఢాబాలో పని చేస్తున్న జాకీర్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో ఆదోనికి తరలించారు. కోసిగమ్మకు భర్త లక్ష్మన్న, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కోసిగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలకలడోన గ్రామంలో గ్రామ సేవకుడు టి.గుంటప్ప అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని భార్య తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ రవి శనివారం గుంటప్ప కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్ఐ ఆదాం, విఆర్ఒ ప్రభాకర్, విఆర్ఎ అనిల్ కుమార్‌ను పంపించారు. గుంటప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మరో రూ.15 వేలు ఇస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ కోర్సులు అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైష్ణవి డిగ్రీ కళాశాలలో మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ కోర్సులు ఉండడం అభినందనీయమని పట్టణ సిఐ శ్రీనివాసులు, పట్టణ ప్రముఖ వైద్యులు, స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ శిల్పా, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మనోజ్ తెలిపారు. శనివారం వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో భాగంగా బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థులకు రెండు నెలల సైబర్ క్రైమ్ శిక్షణ కార్యక్రమం, బీఎస్సీ, బీజడ్‌సీ విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై మూడు నెలల శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన సర్టిఫికెట్ల పంపిణీ చేపట్టారు. వైష్ణవి డిగ్రీ కళాశాల ఛైర్మన్ జీడి లింగప్ప, కరస్పాండెంట్ సత్యశ్రీ అధ్యక్షత వహించారు. మంచి భవిష్యత్తు కోసం యాజమాన్యం తీసుకొచ్చిన కోర్సుల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని పేర్కొన్నారు. మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ లాంటి కోర్సులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నగరాల్లో ఈ కోర్సులకు రూ.లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుందని తెలిపారు. మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ టీచింగ్ నిర్వాహకులు సుధీర్, నాగరాజు, వైష్ణవి ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ శ్రీనివాసులు

అందరి భవిష్యత్తుకు చంద్రబాబు భరోసా

- మండలంలో సిసి రోడ్డు నిర్మాణాలు, తాగునీటి వసతికి ప్రత్యేక ప్రణాళికలు
- జడ్‌పిటిసిల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు ఏరూరు మీనాక్షినాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి

అందరి భవిష్యత్తు బాగుండాలంటే, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సాధ్యమని జడ్‌పిటిసిల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు ఏరూరు మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం ఏరూరు మీనాక్షి నాయుడు పుట్టినరోజు వేడుకలను కర్నూలు, అనంతపురం జిల్లాల టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మీనాక్షి నాయుడును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీనాక్షి నాయుడు మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలోనూ సిసి రోడ్డు నిర్మాణాలు, తాగునీటి వసతి సమకూర్చడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అన్ని కులాలు, మతాల వారికి టిడిపిలో సమ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో పని చేసిన ప్రతి కార్యకర్తకూ నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలో ప్రతి నాయకుని, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి అనంతపురం జిల్లాలో పర్యటించగా ఆలూరు బ్రాంచి కెనాల్‌కు తూమును ఏర్పాటు చేయాలని, అలాగే నగరడోన రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు అమరప్ప, నీటిసంఘం అధ్యక్షులు దానప్ప, మిరపకాయల చంద్ర, యువ నాయకులు హరి, దళిత నాయకులు రామాంజిని, సర్పంచులు కొండా పురుషోత్తం, బంటనహాళ్ సురేష్, కోనంకి సతీష్, రాజేష్ శెట్టి, జనార్ధన స్వామి, రాజా పాల్గొన్నారు.



మీనాక్షి నాయుడును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పండ్ల తోటల పెంపకంపై రైతులందరూ దృష్టి పెట్టి సాగు చేయాలని ఎంపిడిఒ అల్లా బకాష్, ఎపిఒ జుబేర్ అహ్మద్ రైతులకు, ఉపాధి హామీ కూలీలకు తెలిపారు. శనివారం చిప్పగిరి బీరప్ప స్వామి దేవాలయ ఆవరణలో సర్పంచి దాసరి గోవింద రాజులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ప్రమీల, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రఘు ఆధ్వర్యంలో రైతులకు, ఉపాధి హామీ కూలీలకు పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పండ్ల తోటల పెంపకంతో రైతులకు వంద శాతం రాయితీ అందుతుందని, మొక్కలన్నీ ఉపాధి హామీ సిబ్బంది ద్వారా పొందవచ్చని తెలిపారు. పండ్ల తోటల వల్ల రైతులకు కూడా మంచి ఆదాయాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలన్నీ వారి సంబంధిత ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఆస్పిరేషనల్ అధికారి నరసింహులు, ఉపాధి హామీ టిఎ మారుతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, ఎపిఒ

పరస్పర సహకారంతో ముందుకు సాగడమే స్నేహబంధం

- 1999- 2000 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గోనెగండ్ల

పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు సహకరించుకుంటూ జీవితంలో ముందుకు సాగడమే నిజమైన స్నేహబంధమని పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, వెంకటరాముడు, ఆత్మకూరు విశ్రాంత ఎంఇఒ జానకి రాముడు, సైన్స్ విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మాధవ స్వామి తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 పదో తరగతి బ్యాచి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా తాము చదువుకున్న పాఠశాల పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా ఊరేగిస్తూ ర్యాలీగా బాషా ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఒకరి గురించి ఇంకొకరు కుటుంబ వివరాలను, విషయాలను తెలుసుకుంటూ ఆనందోత్సాహాలతో సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు రాఘవ రెడ్డి, అన్వర్ బాషా, రాజేశ్వరి, పూర్వపు విద్యార్థులు షెక్షావలీ, రామకృష్ణ, గానిగ బాష, మునెప్ప, ఖాసీం వలీ, జిక్రియ, ప్రభాకర్ రెడ్డి, సౌజన్య, మహాలక్ష్మి పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మురుగు కాలువకు ఇనుప జాలి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శుక్రవారంపేటలో రోడ్డుపై గుంత ఉండడంతో సమస్యను తెలుసుకున్న మాజీ కౌన్సిలర్, టిడిపి 2వ వార్డు ఇన్‌ఛార్జీ తిమ్మప్ప, గొల్ల మల్లేశ్వరరావు స్వంత ఖర్చులతో 80 కిలోల ఇనుము జాలి వేసి మరమ్మతులు చేపట్టారు. వారు మాట్లాడారు. ప్రయాణికుల భద్రత కోసమే మరమ్మతులు చేపట్టామని చెప్పారు. గతంలో ఈ గుంత కారణంగా పలువురు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. హుస్సేని పాల్గొన్నారు.